# దొంగకో నూటపోగు

## పి.చంద్రశేఖర ఆజాద్

నేను మొదటిసారి భాగ్యనగరంలో అడుగుపెట్టినప్పుడు తన్మయత్వం చెందాను. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి, బయటకు వచ్చి, వెనక్కి తిరిగి స్టేషన్‌కేసి చూశాను. తర్వాత డబల్ డెక్కర్ బస్‌ని స్టేషన్ ముందు చూశాను. అది ఎక్కి మహదానందం అనుభవిస్తుండగా 'టికెట్' అని వినిపిస్తే జేబులో చెయ్యి పెట్టాను. నాకు పర్స్ కనిపించలేదు. మొట్ట మొదటిసారి నా జేబెవడో కొట్టేశాడు. నేను బస్సు దిగి ఇది భాగ్యనగరం కాదు, దొంగల నగరం అని తిట్టుకొని పోలీస్ స్టేషన్‌కెళ్ళి రిపోర్ట్ చేశాను.

''ఏమాత్రం వుందేంటి పర్సులో'' అన్నాడో కానిస్టేబుల్.

''పదిహేను వందలు'' అన్నాను.


అతనో నూట ఏభై తీసి చేతిలో పెట్టాడు. అప్పుడూ మహానుభూతే! నా కళ్ళవెంట అశ్రువులు జాలువారాయి.


''ఎందుకేడుస్తున్నావ్?'' అన్నాడతను.

''ముందు మీరు ఈ డబ్బులు ఎందుకిస్తున్నారో చెప్పండి. అప్పుడు నా కన్నీళ్ళు సంతోషంవల్లా, దుఃఖంవల్లా, ఎందుకొచ్చాయో తేల్చుకుంటాను'' అన్నాను.

''నువ్వీ నగరానికి కొత్త అనుకుంటాను. నీ డబ్బులు తిరిగి రావు. దొంగ తనం చేసినవాడు దొరికినా ఆ డబ్బు రికవర్ కాదు. అందుకే నేను నీమీద జాలిపడి యిచ్చాను'' అన్నాడు.

పోలీసుల్లోనూ ఇంత నిజాయితీపరులున్నారని తెలిసి మళ్ళీ





కన్నీళ్ళు జలజల రాలాయి.

''మళ్ళీ ఏడుస్తున్నావా?'' అన్నాడు.

''ఇవి ఆనందభాష్పాలు'' అన్నాను.

''సినిమాకి కథలు రాయడానికి వచ్చావా?'' అన్నాడు.

''మీకెలా తెలుసు'' అని నేను మళ్ళీ ఏదో అన బోయాను.

''చూడు బాబూ. పదేపదే నువ్వు కన్నీళ్ళు పెట్టుకోవటమో, ఆనందభాష్పాలు రాల్చటమో చేయవద్దు. నగరంలోకి టెర్రరిస్టులు అడుగుపెడుతున్నారో, సినిమా నటులూ, రచయితలూ అడుగుపెడుతున్నారో, దొంగలు అడుగుపెడుతున్నారో మాకు తెలుస్తుంది'' అన్నాడు.

''కానిస్టేబుల్ గారూ – పోలీస్ స్టేషన్లలో అప్పుడప్పుడూ ప్రేమ వివాహాలు జరిపిస్తారని నాకు తెలుసు. పత్రికల్లో చదువుతుంటాను. కానీ ఇలా డబ్బులు పోయినా వెంటనే డబ్బులు ఇస్తారని తెలియదు. నేనిప్పుడు బాధపడుతున్నాను'' అన్నాడు.

''ఎందుకు బాధపడటం?'' అన్నాడు.

''నేను పదిహేను వేలు పోగొట్టుకున్నానని చెబితే పదిహేను వందలు యిచ్చేవారు కదా'' అన్నాను.

అప్పుడా కానిస్టేబుల్ నవ్వాడు. తర్వాత వెళ్ళమన్నాడు.

ఆ కానిస్టేబుల్ ఎందుకు నవ్వాడో నా ఫ్యాన్సీ షాపు మిత్రుడు చెప్పాడు తర్వాత. అతనేం చెప్పినా నవ్వకుండానే చెబుతాడు.

''కాన్‌స్టేబు అలానే నవ్వుతారు'' అన్నాడు ప్రారంభిస్తూ.

''కాన్‌స్టేబు ఏమిటి?'' అన్నాను మొదట్లోనే అడ్డుపడుతూ.

''అంటే నువ్వు ఏమీ చదవకుండానే సిన్మాలకు కతలు రాయటానికి వచ్చావా?'' అన్నాడు.

''సినిమా కతలు రాయడానికి చదవటం ఎందుకు? చూడాలి. అన్ని భాషల సినిమాలు చూసి అందులో ఒక్కోసీన్ తీసుకుని అతికిస్తే సినిమా కత తయారవుతుంది'' అన్నాను.

నా జ్ఞానానికి ఆయన బోల్డంత ఆనందించాడు. అయితే ఆయన నవ్వడని ముందే చెప్పానుగా. ''మీ రచయితల్లో చాలా చమత్కారులున్నారు. కొంతమంది 'పొలీస్' అని ఇంకొందరు 'పోలీసు' అని రాస్తారు. అలాగే కొంతమంది 'కాన్‌స్టేబు' అంటే ఇంకొందరు 'కానిస్టేబుల్' అని రాస్తారు. దొంగలందరూ ఒకటి కాదు. అలాగే కానిస్టేబులంతా ఒకటి కాదు. నీ ముఖం చూసి నీ హిస్టరీ చెబుతారు. నువ్వు నిజం చెప్పినందుకు నీకు నూట యాభై యిచ్చాడు'' అని మిత్రుడు అన్నాడు.

ఆయన చెప్పిందాని ప్రకారం ఆ దొంగలకు – పోలీసులకీ మధ్య 'అవగాహన' 'ఒప్పందం' 'సర్దుబాట్లు' వుంటాయంట. ఇవన్నీ రాజకీయ నాయకుల పదాలు కదా అన్నాను. పదాలు ఎవరి స్వంతంకావని అతను కోప్పడ్డాడు. ఆ దొంగ పర్సులో వెయ్యి రూపాయలు మాత్రమే వున్నాయని చెబితే 'ఎన్‌కౌంటర్' చేస్తాడంట కానిస్టేబు. 'ఎన్‌కౌంటర్' అంటే కాల్చి చంపటం కాదు. డిస్కషన్‌లో అదో భాగం' అన్నాడు.

నా నగర జీవితం అలా దొంగల బారిన పడటంతో ఆరంభం అయింది. తర్వాత నాకు తెలిసిన వారి ఇంటికి వెళ్ళాను. ఒకరోజు భోజనం పెట్టారు. రెండోరోజు రెండువేలు చేతిలో పెట్టారు. ఇంకెప్పుడూ డబ్బులకోసం మాత్రం ఇంటికి రావద్దన్నారు. భోజనానికి కూడా అనుకోండి.

నేను నగర సరిహద్దులకవతల ఓ గది తీసుకున్నాను. నేనే వండుకు తినటం మొదలుపెట్టాను. కిరసనాయిలు స్టవ్, ఓ చాప, నాలుగయిదు పాత్రలూ (వంటకి), నా స్క్రిప్టులు ఆ గదిలో వుండేవి. మా దగ్గర్లో ఫ్యాన్సీ షాపు వుంది. ఆయన్తో పరిచయం అయ్యాక ఎప్పుడన్నా తీరిక దొరికినప్పుడు ఆయన్తో కబుర్లు చెబుతుండేవాడిని.

ఆయన షాపుకి కస్టమర్లు అరుదుగా వస్తుంటారు. సిటీలో షాపు తెరవాలంటే లక్షలు కావాలి. మన దగ్గర అంత సొమ్ము ఎక్కడుంది అంటాడతను.

''లోన్ తీసుకోవచ్చు కదా'' అన్నానోసారి.

''లోన్లు కట్టేవారికిస్తే వాళ్ళకి లాభాలు రావు'' అన్నాడు.

''అదేంటి?'' అన్నాను.

''ఈ కాలంలో బ్యాంకులు పెట్టాలి. డిపాజిట్లు కలెక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత మూసేయాలి. వచ్చిన డిపాజిట్లను బంధువులకు లోన్లుగా ఇవ్వాలి. నాకు తెలిసిన బంధువులు బ్యాంకుల్లో లేరు'' అన్నాడతను.

''అంటే నగరమంతా దొంగలేనా'' అన్నాను.

''కాదు దొంగల మధ్య ప్రజలున్నారు'' అన్నాడు.

నేను కూడా ఆయన్తో మాట్లాడితే ఏదోఒక కామెడీ కథ దొరక్కపోతుందా అని వెళ్తుంటాను.

మొదట్లో కొన్ని సినిమా కంపెనీల చుట్టూ తిరిగాను, నా దగ్గర సినిమా కథలున్నాయని. మా దగ్గరా వున్నాయి, నిర్మాతలే లేరు అన్నారు కొందరు. ఓ స్టూడియో గేటు ముందు కాపలా వున్న మనిషి నా దగ్గర ఏభై కథలున్నాయి అన్నాడు. అప్పుడు నాకు జ్ఞానోదయం కలిగింది.

నాకు తెలిసినవారు డబ్బులకోసం ఇంటికెప్పుడూ రావద్దన్నారు కాబట్టి నేను బతకడంకోసం ఓ ఫ్యాక్టరీలో చేరాను. అలాగని కతలు తయారు చేసే ప్రయత్నం మానలేదు.

అసలు మా కాలనీనే చిత్రమైంది. 'అబ్బాయి కొంచెం పేస్ట్ వేస్తావూ' అంటూ వస్తాడో పెద్దాయన. మొదటి నాలుగు రోజులు వేశాను. అది రెగ్యులర్ కార్యక్రమం అయింది. నేను పేస్టు మానేసి పళ్ళ పొడి తెచ్చుకున్నాను.

''ఇదేంటయ్యా - ఈ పళ్లపొడి గరుగ్గా వుంటుంది. పళ్లు పాడవుతాయి'' అన్నాడు.

''ఎవరి పళ్ళు'' అన్నాను.

''నావే'' అన్నాడు.

''అందుకే వాడుతున్నాను'' అని నిర్మొహమాటంగా అన్నాను.

'నువ్వు భలే మాట్లాడతావే'' అని భుజంమీద తట్టి 'ఏం చేస్తాం. చస్తామా, అదే ఇవ్వు' అని తనే స్వతంత్రంగా అరచేతిలో వేసుకొన్నాడు. ఆయనే కాదు ఆడవాళ్ళు కొంచెం 'నిర్మా' ఇవ్వరూ - బట్టల సబ్బు ఇవ్వరూ - పాలు విరిగిపోయాయి, ఓ గిద్దెడు పాలివ్వరూ పిల్లవాడు ఏడుస్తున్నాడు అంటూ తీసుకుంటారు. తీసుకోవటంలో చాలా నిర్మొహమాటంగా ఉంటారు. తిరిగి ఇవ్వాల్సి వచ్చినపుడు మొహమాటపడుతుంటారు.

ఈ ప్రాంతం నుంచి ఎప్పుడు వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాను. ఇంత తక్కువ అద్దెలో ఇల్లు దొరకదు. అందుకే భరిస్తున్నాను.

నేను మనసు బాగుండక ఫ్యాన్సీ షాప్ మిత్రుడి దగ్గరికెళ్ళాను. లోపలకి వెళ్తుంటే ... ''చెప్పుల్తో లోపలికి రాకండి'' అన్నాడాయన. ఆయన చెప్పులు కూడా షాపు బయటే వున్నాయి. నేను నా చెప్పులు విడిచి లోపలికి వెళ్ళాను.

''ఏంటి అలా వున్నావు?'' అన్నాడు.

''ఏం చెయ్యమంటారు. సినిమాలకి కథలు రాయాలనుకుని వచ్చాను. ఇప్పుడో కంపెనీలో వర్కర్‌గా చేస్తున్నాను. గదికి వెళ్ళాక ప్రశాంతంగా కూర్చుని రాసుకోవడానికి లేదు'' అన్నాను.

మా దగ్గర విషయాలన్నీ చెప్పాను. ఆయన సానుభూతితో విన్నాడు.

''వస్తానండి'' అని బయటకు వచ్చాను. బయట నా చెప్పులు లేవు.

''ఇదేంటి సార్ అన్యాయం'' అన్నాను.

''అన్యాయం ఏముంది... ఇది దొంగల కాలనీ... మన జాగ్రత్తలో మనం వుండాలి'' అన్నాడతను.

''మీ చెప్పులు వదిలిపెట్టి నావి తీసుకువెళ్ళటం ఏమిటి?'' అన్నాను.

''వాళ్ళకి ఏది నచ్చితే అది తీసుకుపోతారు'' అన్నాడు.

''అదొకటుందా?'' అన్నాను.

''దొంగతనం గురించి మీకు నేను ప్రత్యేకంగా చెప్పాలా. సిన్మావాళ్ళూ, రచయితలూ నచ్చిన వాటినే దొంగతనం చేస్తారు. ఒకరి దగ్గర దొంగతనం చేస్తే ప్లేగియారిజం అంటారు. వందమంది దగ్గర దొంగతనం చేస్తే డాక్టరేట్ అంటారు'' అన్నాడతను.

అతను నవ్వడు. నవ్వకపోవటానికి శారీరక కారణాలు ఏమన్నా వున్నాయా అని నాకు అనుమానం. అప్పుడే రోడ్డుమీద ఓ వ్యక్తి వెళ్తుంటే అతన్ని పిలిచాడు.

''ఇతనో దొంగ. కాస్త అభిమానం వున్నవాడు. మీకు పరిచయం చేస్తాను'' అన్నాడు.

''నాకెందుకు?'' అన్నాను కంగారుపడుతూ.

''సిన్మా కతలకు ఉపయోగపడతాడు'' అన్నాడు.

అతను వచ్చాడు.

''ఏంటి సార్'' అన్నాడు.

''వ్యాపారం బాగుండలేదు. నేను షాపు మూసేయాలనుకుంటున్నాను''.

''మూసి ఏం చేస్తారు?''

''మీతోపాటు రావాలనుకుంటున్నాను'' అన్నాడు షాపాయన.

''వీరెవరు?''

''మన కాలనీలోనే వుంటారు. ఇప్పుడే ఈయన చెప్పులు ఎవరో ఎత్తుకెళ్లారు'' అన్నాడు.

''కుక్కలు తీసుకుపోయాయేమో!''

''కుక్కలు కాదండి. ఎవడో దొంగవెధవ. కుక్కయితే నాలుగు చెప్పులుంటే రెండెందుకు తీసుకువెళ్తుంది'' అన్నాను.

''మాస్టారు 'దొంగవెధవ' అనకండి. మీరోసారి దొంగతనం చేసి చూడండి తెలుస్తుంది'' అన్నాడు సీరియస్‌గా.

''నేను దొంగతనం ఎందుకు చేయాలి?'' అన్నాను మరింత సీరియస్‌గా.

''ఈయన షాపు ఎందుకు పెట్టాడు? మీరు ఉద్యోగం ఎందుకు చేస్తున్నారు? మే దొంగతనం అందుకే చేస్తాం. కుక్కలు అన్ని చెప్పుల్నీ తీసుకుపోవు'' అన్నాడు.

నేను అయోమయంగా షాపు మిత్రుడ్ని చూశాను.

''అది సరే బాస్ - నేను నీతో వస్తాను'' అన్నాడు షాపతను.

''వస్తానంటే కుదురుతుందా... ట్రైనింగ్ తీసుకోవాలి. దొంగతనం అంటే మాటలు కాదు. అదో కళ'' అన్నాడు.

''కళా!'' అన్నాను.

''కళే కాదు. అదో మహాసముద్రం. దాని లోతు ఎవరికి తెలుస్తుంది'' అన్నాడు.

''ఆయన సినిమా కతలు రాయాలనుకుంటున్నారు''.

''అట్టయితే లిఫ్ట్ ఇరిగేషన్ పథకమేగా, మామీద పడతారెందుకు?'' అన్నాడు.

''మీరు చదువుకున్నారా?''

''అవును. ఈ ప్రపంచంలో 'దొంగ' కాని వాడూ, దొంగతనం చేయని రంగమూ ఒక్కటీ లేదు. మార్కెటింగ్ టెక్నిక్‌లు తెలియాలి. పత్రికలు, రాజకీయాలు, సినిమాలు, బొమ్మలు, అసలు మనిషి పుట్టిందగ్గర్నుండి చచ్చేదాకా దొంగ కానిదే

## రచయిత పరిచయం



'దొంగకో నూలుపోగు' కథ పంపిస్తూ ఈ కథ నా స్వంత రచన కాదు, జీవితం నుండి దొంగతనం చేశాను అని హామీ పత్రంలో రాశాను. కథకు బహుమతి వస్తే నా నిజాయితీని గుర్తించారనీ, బహుమతి రానిపక్షంలో నీ స్వంతం కాని కథకు మేం బహుమతి ఎందుకివ్వాలనుకునుంటారని సంతృప్తి చెందుదామనుకున్నాను. 'నవ్య' వారపత్రిక వారు ఈ కథకు బహుమతి ఇచ్చారు.

శ్రీరమణ గారు చెక్కుతోపాటు ఉత్తరం పంపారు. అందులో ఇలా వుంది: 'కథకుడికో నూలుపోగుగా యీ చిన్న బహుమతిని అందజేస్తున్నాం. ధరించ ప్రార్థన'. ఒక్కోసారి కథకంటే ఇలాంటి చమత్కారాలు బాగుంటాయి. మీకు కథ నచ్చితే ధన్యుడ్నే. అనిల్ అవార్డ్ - స్వాతి, చతుర, బాలజ్యోతి, వరుసగా 'ఆటా-తానా-ఆటా' నవలల పోటీల్లో బహుమతులు వచ్చాయి. అధికార భాషా సంఘం అవార్డు, త్రిపురనేని రామస్వామి అవార్డు వచ్చాయి. చాలా కథలకు బహుమతులు వచ్చాయి.

నేను రచయితను కావటం వెనుక డిటెక్టివ్ నవలల ప్రభావం చాలా వుంది. 'అపరాధ పరిశోధన' పత్రిక ద్వారా నేను రచయితగా నలుగురికీ తెలిశాను. చిన్నప్పుడు కొమ్మూరి గారి యుగంధర్ అంటే చాలా ఇష్టం. ఆయన పేరు మీద బహుమతి అందుకోవటం ఓ మధురమైన జ్ఞాపకం.

**- పి.చంద్రశేఖర ఆజాద్**

బతకలేరు'' అని వేదాంతం చెప్పాడు.

''ఇప్పుడు నా గురించి చెప్పండి. ఫిలాసఫీ తర్వాత'' అన్నాడు షాపతను.

''మీరు బస్సుల్లో దొంగతనం చేస్తారా? ఛెయిన్ స్నాచింగా? షట్టర్లు లిఫ్ట్ చేయటమా? తాళాలు తీయటమా? శివార్లలో బండరాళ్ళు పెట్టి తలుపులు బద్దలు చేయటమా? ఏరకం దొంగతనాలు చేయాలనుకుంటున్నారు. అది డిసైడ్ చేసుకోండి. ముందు మేము నేర్పేది 'బీటింగ్'.''

''అదేంటయ్యా ఛీటింగ్ నేర్పమంటే బీటింగ్ నేర్పుతానంటావ్?''

''ఛీటింగ్ దొంగలు చేయరు. దొరలు చేస్తారు. పోలీసులూ - జనం దొంగల్ని పట్టుకుంటే విరగ్గొడతారు. అది భరించటం చేతయితే సెకండ్ ఫేజ్‌లోకి వెళ్ళొచ్చు.

''లాఠీల్తో కొడతావా?'' అన్నాడు షాపతను.

''లాఠీలేంటి బ్రదర్. గోళ్ళలో సూదులు గుచ్చుతాం. కారం పలానాచోట కొడతాం. 'అమ్మా, అయ్యా' అనకూడదు. లాఠీ నడుంమీద పెట్టి చపాతీ చేస్తాం.''

నాకు మతిపోతోంది. దొంగతనం ఇంత కష్టమా!

''ఏమాత్రం ఛార్జ్ చేస్తారేంటి?''

''దొంగలకో నీతుంది. ఇవన్నీ ఉచితంగా చేస్తాం. నీ అంతట నువ్వు దొంగగా ఎదిగినప్పుడు గురుదక్షిణ చెల్లించుకోవచ్చు'' అన్నాడు.

''ఇంకా...'' అన్నాడు.

''ఇంకేముంది. మా వాళ్ళలో సగంమంది చర్లపల్లి జైల్లోనూ, ఇంకొంతమంది ముషీరాబాద్ జైల్లోనూ వున్నారు. ఆగస్టు పదిహేనున కొంతమంది బయటకొచ్చారు. జనవరి ఇర్వై ఆరున ఇంకొంతమంది వస్తారు. అందులో సీనియర్స్ వున్నారు. వాళ్ళ దగ్గర టిప్స్ తెలుసుకోవచ్చు.

''మీరేంటి ఖాళీగా వున్నారు''.

''నేను ఈరోజు సిటీబస్సులు చూసుకుంటున్నా. ఇది లంచవర్ కదా''.

''ఎవరికి?'' అన్నాడు షాపతను.

''అందరికీ. ఇప్పుడు ప్యాసింజర్లు తక్కువ వుంటారు. జనం కిటకిటలాడుతున్నప్పుడు బస్సెక్కాలి. దొంగతనం అంత ఈజీ అయితే ప్రపంచంలో అందరూ దొంగలయ్యేవారు.''

''ఇప్పుడేకదండి పుట్టే ప్రతివాడూ దొంగే అన్నారు'' అన్నాను.

''ఇప్పుడు కాదన్నానా?'' అన్నాడు అతను సీరియస్‌గా.

షాపతను నవ్వకుండా మా ఇద్దర్నీ చూస్తున్నాడు.

''జూనియర్ ఆర్టిస్టూ, ఆర్టిస్టూ, స్టారూ - సూపర్‌స్టారూ వుంటారు. అలాగే మాలోనూ దొంగ - గజదొంగ - రేచుక్క - పగటిచుక్క - మహాదొంగ వుంటారు. దొంగ ముదిరితే మాఫియా అవుతాడు. ఈ ప్రపంచంలో మీరు ఏ రంగాన్ని తీసుకున్నా తెలివిగల దొంగ - తెలివితక్కువ దొంగ వుంటారు. దొంగ అనగా దొంగిలించువాడు. ప్రేమను దొంగిలించేవాడు ప్రేమదొంగ... ప్రేమ ముదిర్తే గర్భం,

**జూనియర్ ఆర్టిస్టూ, ఆర్టిస్టూ, స్టారూ - సూపర్‌స్టారూ వుంటారు. అలాగే మాలోనూ దొంగ - గజదొంగ - రేచుక్క - పగటిచుక్క - మహాదొంగ వుంటారు. దొంగ ముదిరితే మాఫియా అవుతాడు. ఈ ప్రపంచంలో మీరు ఏ రంగాన్ని తీసుకున్నా తెలివిగల దొంగ - తెలివితక్కువ దొంగ వుంటారు.**

గర్భం ముదరకపోతే అబార్షన్, గర్భంవల్లా, ప్రేమవల్లా పెళ్ళి. అది ముదిరితే విడాకులు... అయ్యా ఇలా ఏ రంగం తీసుకున్నా తీసుకునేవాడు తప్ప యిచ్చేవాడు లేడు. అంచేత దొంగల్ని ద్వేషించకండి. అది మిమ్మల్ని మీరు ద్వేషించుకున్నట్లు'' అన్నాడు.

నా జీవితంలో నేనింత గొప్ప ఫిలాసఫీ మొదటిసారి వింటున్నాను.

చెప్పులు పోతే పోయాయి. ఆయన పాదాల మీద పడటానికి వంగబోయాను. అతను దూరంగా జరిగాడు.

''అదేంటి సార్. మీ పాదాలు తాకాలనుకున్నాను'' అన్నాను.

''తప్పు మిత్రమా...'' అన్నాడు.

''ఎలా అవుతుంది దొంగ గారూ - తెల్లవారగట్ల లేచిందగ్గర్నుంచి దొంగలకి సన్మానాలు చేస్తున్నాం. పాదాభివందనాలు చేస్తున్నాం. గొప్ప కృషిచేసిన వారికి నమస్కరిస్తున్నాం. మీరు మీ రంగంలో ఇంత అపార అనుభవం గడించారు. మీ మహానుభవానికి నమస్కరిస్తున్నాను'' అన్నాను.

''మీరు సినిమా కతలు రాయాలనుకుంటున్నారా?''

''అవును.''

''చూడండి. సినిమాల్లోనే మాకు గౌరవం. మంచిదొంగ, అందమైన దొంగ, భలేదొంగ, దొంగలకు దొంగ - ఇలా రకరకాల పేర్లతో మాకు గౌరవం కల్పించారు. అది సినిమా. ఇది జీవితం. ఇక్కడ దొంగలకు గౌరవాలుండవు. లాఠీ దెబ్బలుంటాయి. స్టేషన్లో ఫోటోలుంటాయి. కారాగారాలుంటాయి. ఎన్‌కౌంటర్లుంటాయి. అందుకని మీరు నన్ను గౌరవించదలచుకుంటే చెప్పుతో కొట్టండి. అది దొంగలకి గౌరవం. మా పాదాలకు నమస్కరించి మమ్మల్ని అవమానించకండి'' అన్నాను.

ఆ మాటలన్నప్పుడు అతని కంఠం వణికింది.

అతని కళ్ళవెంట నీళ్ళు కారాయి.

''నిజంగానే మిమ్మల్ని కొట్టాలనుకున్నాను. కానీ చెప్పులు లేవు. నా డబ్బుల్తో నేను ఇంకో చెప్పుల జత కొని అప్పుడు మిమ్మల్ని కొడతాను'' అన్నాను.

మా షాపు మిత్రుడు నవ్వాడు. అలా నవ్వినప్పుడు అతనికీ కన్నీళ్ళొచ్చాయి. మా దొంగగారికి అదీ ఒక మహాభినందనే!

★

